క్లుప్తంగా

గురుకుల పాఠశాల తనిఖీ



వేములవాడఅర్బన్: పట్టణంలోని గురుకుల బాలుర పాఠశాలను బోయినపల్లి మండల విద్యాధికారి శ్రవణ్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో వంటసామగ్రి, ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న బోధనగురించి అడిగి తెలుసుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోనరావుపేట: సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న వ్యక్తులు, ఆయా సంస్థల ప్రతినిధులు శ్రీ జనమంచి గౌరీజీ యువ పురస్కార్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఏబీవీపీ నాయకుడు పూజం కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలు ఈనెల 23 నుంచి 25వ తేదీల్లో సిద్దిపేటలో జరగనున్నాయన్నారు. ఏటా జరిగే రాష్ట్ర మహాసభల్లో దరఖాస్తు చేసుకున్న వ్యక్తుల జాబితాను పరిశీలన, ఎంపికచేసి ఏబీవీపీ రాష్ట్ర మహాసభల్లో రూ.50 వేల నగదు, జ్ఞాపికతో సత్కరించనున్నట్లు తెలి పారు. సేవా కార్యక్రమాలు చేస్తున్న 40 ఏళ్లలోపు వారు, ఆయాసంస్థల ప్రతినిధులు గౌరీజీ యువ పురస్కార్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94408 04821 (రామకృష్ణ), 9490866833 (ప్రమోద్), 7702246262(మురళి) నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వైకుంఠ రథం అందజేత



కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి అదే గ్రామానికి చెందిన విక్కుర్తి దేవమ్మ–లింబయ్యల జ్ఞాపకార్థం వారి కుమారులు విక్కుర్తి రామచంద్రం, మధుకర్, మశ్చీంద్ర, అనిల్ వైకుంఠ రథాన్ని బహూకరించారు. ప్రత్యేకంగా సుమారు రూ.2 లక్షల వ్యయంతో వైకుంఠరథాన్ని తయారు చేయించారు. మంగళవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి అంజయ్య, కార్యదర్శి అనిల్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో గ్రామప్రజలు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజమే లక్ష్యం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

రుద్రంగి: టీబీ రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా నిక్షయ్ సివిర్ కార్యక్రమాన్ని గ్రామ పంచాయితీ ఆవరణలో మంగళవారం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి టీబీపై అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది, తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆశా కార్యకర్తలు

ఇల్లంతకుంట: జిల్లా కేంద్రంలో బుధవారం తలపెట్టిన బస్సు జాత కార్యక్రమ పోస్టర్‌ను మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశాకార్యకర్తలు ఆవిష్కరించారు. ఆశా వర్కర్ల అధ్యక్షురాలు సొల్లు శాంత మాట్లాడుతూ .. రూ.18 వేలు వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ లక్ష్మి, కస్తూరి, లక్ష్మి ఉన్నారు.

కార్యవర్గం ఎన్నిక



గోపాలచారి

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట పట్టణ స్వర్ణకార సంఘం కార్యవర్గం ఎన్నికలను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎరవెల్లి గోపాలచారి, ఉపాధ్యక్షుడిగా చెన్నోజు పురుషోత్తంను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సంతోష్, గౌరవ సలహాదారులుగా వేణు, శేఖర్, రమేశ్‌ను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులు రమేశ్, ఎర్రోజు దేవేందర్ పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడుతాం

ముస్తాబాద్: ప్రజా సమస్యలపై కేటీఆర్ సేన పోరాటాలు చేస్తుందని కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలాది మంది యువకులు కేటీఆర్ సేనలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, విద్య రంగ సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. రైతు భరోసా, రైతుబీమా వంటి పథకాలను ఎత్తివేశారని, పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదన్నారు. కళాశాలలు, పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ప్రజల మద్దతుతో రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేలా ఉద్యమాలు చేపడుతామన్నారు.

వారసంత.. సమస్యల చింత

- రోడ్ల పక్కనే కూరగాయల విక్రయాలు
- సౌకర్యాలు లేక రైతులు, వ్యాపారుల ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు



హన్మాజిపేటలో రోడ్డుపక్కన కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

వేములవాడరూరల్: రైతులు పండించిన కూరగాయలు విక్రయించేందుకు ప్రతివారం నిర్వహించే వారసంతలో ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. పట్టణ ప్రాంతాల్లో కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వ్యాపారులు కూరగాయలను ఆయాప్రాంతాల్లో విక్రయించేందుకు రోడ్లపై గంటల తరబడి ఉంటున్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో రోడ్లపై దుమ్ము, ధూళిలో ఇబ్బందులు పడుతున్నారు. వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజిపేటలో ప్రతి మంగళవారం సంత జరుగుతుంది. ఈ సంతలో సౌకర్యాలు లేకపోవడంతో పలుగ్రామాల నుంచి వచ్చేవారు ప్రధానరోడ్డు పక్కనే విక్రయాలు జరుపుతున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది తైబజార్ పేరుతో వారి వద్ద డబ్బులు వసూలు చేస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించాల్సిన మేజర్ గ్రామ అధికారులు, సిబ్బంది వారిని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

రోడ్ల మీదే విక్రయిస్తున్నాం



మా గ్రామంలో కూరగాయలు విక్రయించేందుకు ఎలాంటి ఏర్పాట్లు లేవు. ప్రతి వారం రోడ్ల పక్కనే విక్రయిస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలు గ్రామాల నుంచి వచ్చి ఇక్కడ కూరగాయలు కొనుగోలు చేస్తారు. వారసంతలో సౌకర్యాలు కల్పించాలి.

– ఎల్లాల విజయ, హన్మాజిపేట

ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం



హన్మాజిపేట మేజర్ గ్రామ పంచాయతీలో ప్రతివారం సంత జరుగుతుంది. ఇక్కడికి హన్మాజిపేటతో పాటు ఇతర గ్రామాలవారు కూరగాయలు విక్రయించేందుకు వస్తుంటారు. సంత కోసం ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం.

– జంకె శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు



ముస్తాబాద్: ముస్తాబాద్–సిద్దిపేట రహదారిలో తెర్లుమద్ది వై జంక్షన్ ప్రమాదకరంగా ఉంది. మూడు వైపులా ఉన్న రహదారులపై ఎలాంటి హెచ్చరిక సూచికలు లేవు. పైగా రహదారి విస్తరణ అనంతరం వాహనాలు వేగంగా వెళ్తుండటంతో వై జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి, రాత్రి వేళలో వాహనాలు నెమ్మదిగా వెళ్లేలా బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
నాగరాజు, డీఈఈ, ఆర్‌అండ్‌బీ, సెల్ నంబర్ : 9440818420

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

'విప్‌ను విమర్శించే అర్హత చల్మెడకు లేదు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ: ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందిన విప్ ఆది శ్రీనివాస్‌ను విమర్శించే అర్హత చల్మెడ లక్ష్మీనర్సింహరావుకు లేదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం విప్ నివాసంలో మాట్లాడారు. 24 గంటలు ప్రజల మధ్యలో ఉండే విప్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందనీ, ప్రపంచంలో ఎక్కడైనా రూ.32 వేలకు ప్లేట్ భోజనం ఉంటదా, నియోజకవర్గ ప్రజలు గమనించాలని, బీఆర్ఎస్ నాయకుల తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా కళ్లు తెరవాలని, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్న ఆదికి అండగా నిలవాలని, అనవసర ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. రాకేశ్‌రెడ్డి స్థాయిని మరిచి మంత్రిపై విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. గత పదేళ్లుగా కోడెలను సొసైటీల పేరుపై ఇచ్చి అన్యాక్రాంతం చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, సాగారం వెంకటస్వామి, పిల్లి కనకయ్య, రొండి రాజు, రాకేశ్, బింగి మహేశ్, ఇప్పపూల అజయ్, చిలుక రమేశ్, కూరగాయల కొమురయ్య, రాజు, అనిల్, గణేశ్ తదితరులు ఉన్నారు.

23న ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ

ఇల్లంతకుంట : మండలకేంద్రంలో ఈనెల 23నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు ఇల్లంతకుంట స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు మామిడి రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు ఈనెల 21వ తేదీలోపు ఎంట్రీ ఫీజు రూ.వెయ్యి చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఎంట్రీ ఫీజు రూ.4వేలు ఉంటుందని, గెలుపొందిన జట్టుకు ప్రథమ బహుమతి రూ.40 వేలు, ద్వితీయ జట్టుకు రూ.20వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన నిఖిల

ముస్తాబాద్: మండల పశువైద్యాధికారిగా నిఖిల మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ముస్తాబాద్ వైద్యాధికారి జ్యోతి మెదక్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఇన్‌చార్జి వైద్యాధికారిగా తంగళ్లపల్లికి చెందిన హరిత పనిచేశారు. కొత్త రిక్రూట్‌మెంట్‌లో నిఖిల వైద్యాధికారిగా ఎంపికై తొలి పోస్టింగ్‌గా ముస్తాబాద్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందేలా చూస్తామన్నారు.

కుల బహిష్కరణపై విచారణ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు అదే సామాజిక వర్గానికి చెందిన అల్లం శ్రీకాంత్‌ను కుల బహిష్కరణ చేసిన సంఘటనపై మంగళవారం పోలీసులు విచారణ నిర్వహించారు. తండ్రి, కొడుకుల మధ్య గొడవల నేపథ్యంలో కుల పెద్ద మనుషులు శ్రీకాంత్‌ను కుల బహిష్కరణ చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు 8 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై క్షేత్రస్థాయిలో ఎస్సై రమాకాంత్ కుల సంఘం భవనంలో సంఘ సభ్యులు, పలువురిని విచారించారు. ఎస్సై మాట్లాడుతూ... పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎవరైనా కుల బహిష్కరణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పరామర్శ



కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేటలో సాక్షి ఆర్సీ ఇన్‌చార్జి వూరడి మల్లికార్జున్, బీఆర్ఎస్ నాయకుడు తిరుపతియాదవ్‌ను పలువురు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం పరామర్శించారు. వీరి తల్లి రామవ్వ ఇటీవలే మృతి చెందింది. నాయకులు బొల్లి రామ్మోహన్, అగ్గి రాములు, మాట్ల మధు, వేములవాడ రూరల్ మాజీ ఎంపీపీ బండ మల్లేశ్‌యాదవ్ తదితరులు పరామర్శించారు. వీరితో పాటు మున్సిపల్, అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ (హైదరాబాద్) అడిషనల్ డైరెక్టర్ మామిండ్ల దశరథం ఉన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు రూ. 50లక్షల నిధులు కేటాయించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ను కాంగ్రెస్ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిచిపోయినట్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన మంత్రి నిధుల మంజూరుకు కృషిచేస్తానన్నారు. మంత్రిని కలిసిన వారిలో సీనియర్ నాయకులు బు చ్చిలింగు సంతోష్‌గౌడ్, రాములు, బాబు తదితరులున్నారు.

మత ప్రచారాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట: రాచర్ల గొల్లపల్లి గ్రామం డబుల్ బెడ్ రూం కాలనీలో మత ప్రచారాన్ని మంగళవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..డబుల్‌బెడ్రూం కాలనీలో కొందరు మతప్రచారం చేస్తూ బైబిల్ కరపత్రాలు పంచారు. కొందరు చిన్నారులకు ఇస్తుండగా విషయం తెలుసుకున్న హిందూ ఉత్సవ సమితి సభ్యులు వచ్చి అడ్డుకున్నారు. వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇక్కడ ఉత్సవ సమితి సభ్యులు రాము, తిరుపతి రెడ్డి, రంజిత్ కుమార్, గణేశ్, లక్ష్మారెడ్డి, లక్ష్మణ్, రాజు, విజయ్ తదితరులున్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో మంగళవారం భక్తుల సందడి కొనసాగింది. సాయంత్రం 6 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	02	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	18	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	02	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	01	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	06	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	10	560
నందీశ్వర సూట్స్	05	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	23	448
పార్వతీపురం స్పెషల్	24	672
పార్వతీపురం సాధారణ	22	336

– వేములవాడ

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్, నాయకులు

చందుర్తి: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని రుద్రంగి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు బొజ్జ మల్లేశం అన్నారు. మండలస్థాయి సీఎం కప్ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు చందుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో బండి ప్రదీప్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, నాయకులు పులి సత్తయ్య, మ్యాకల గణేశ్, మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వినూత్నం.. లగ్నపత్రిక



తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లి గ్రామానికి చెందిన బొనుగాని రంజిత్ యాదవ్ వివాహం ఈనెల 18న, రిసెప్షన్ 19న జరగనుండగా అతడు తయారుచేయించిన లగ్నపత్రిక వినూత్నంగా ఉంది. లగ్గం పిలుపు అని మొదలై పెళ్లికార్డులో పగటాల్ల 12:47 గొట్టంగ మా చిన్న కొడుకు రంజిత్ యాదవ్ లగ్గ వైష్ణవి మల్లేశ్ యాదవ్ లావణ్యల ఒక్కగానొక్క బిడ్డతో అని ఉంది. పిలిశెటోల్లు, అర్సుకునేటోల్లు, లగ్గం యాడనో ఎర్కైన, మారువెళ్లి అంటూ వివరాలను వెల్లడించారు. చివరగా మా చిన్నబాపు లగ్గంకు ఖచ్చితంగా రావాలే అంటూ చిన్నారుల పేర్లతో ముగించారు. ఇప్పుడు ఈ వివాహ ఆహ్వాన పత్రిక సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

పెన్షనర్ల దినోత్సవం



బోయినపల్లి: పెన్షనర్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

బోయినపల్లి: మండలకేంద్రంలో మంగళవారం అఖిల భారత పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షన్ దారులు కే.హన్మాండ్లు, సీహెచ్. నారాయణరెడ్డి, నర్సయ్యను ఘనంగా సన్మానించారు. సంఘం గౌరవాధ్యక్షుడు సి.రామరాజు మాట్లాడుతూ పెన్షనర్లు పోరాటాలతో తమ హక్కులు సాధించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, క్యాదర్శులు ద్యావనపెల్లి శ్రీహరి, దండు రాజమల్లయ్య, సభ్యులు మల్కారి వెంకటయ్య, మారం చెంద్రయ్య, నల్లగొండ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: జాతీయ పెన్షనర్స్‌డే సందర్భంగా మండలకేంద్రంలో మంగళవారం పలువురు విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు బిగుళ్ల పరశురాం, క్యారం భూమయ్య, సంపత్, రామచంద్రం, రాజయ్య, భూపతి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక



వేములవాడరూరల్: వేములవాడ పరిధిలోని శాత్రాజుపల్లిలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జింక శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండ మహేందర్, ఉపాధ్యక్షుడిగా మొక్కనపల్లి అశోక్, ప్రధాన కార్యదర్శిగా కొల్లూరు అమర్, కార్యవర్గ సభ్యులుగా గుడిసె శ్రవణ్, ప్రవీణ్, ప్రేమ్ చందును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుడిసె మనోజ్, పడిగేల బాబు, దోమకొండ మహేందర్, జింక శేఖర్, గుడిసె ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం



వీర్నపల్లి: మండలంలోని భూక్యాతండా గ్రామ పంచాయతీ పరిధి రాశిగుట్ట తండాలో శిలఫలకాన్ని ధ్వంసంచేసిన చేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్లాగౌడ్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. భూక్య తండాకు చెందిన భూక్య నవీన్ తన ట్రాక్టర్‌ను సోమవారం రాత్రి ఆజాగ్రత్తగా నడిపడంతో శిలాఫలకం ధ్వంసమైనట్లు తండావాసులు తెలిపారు. పీఆర్ ఏఈ శ్రీనివాస్ ధ్వంసమైన శిలాఫలకాన్ని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్లాగౌడ్ తెలిపారు.

సభ్యత్వ నమోదు



చందుర్తి : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల దేవరాజు ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 370తో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. సమగ్ర శిక్ష తాత్కాలిక ఉద్యోగులందరికీ టైమ్ స్కేల్‌ను వర్తింపజేసి రెగ్యులరైజ్ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లిస్తూ, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మరాఠి అజయ్, ప్యారం లక్ష్మీనారాయణ, మారంపల్లి రాజయ్య, కట్కూరి ముఖేశ్, ధర్మపురి శ్రీనివాస్, సుల్తాన్ ఎల్లయ్య, బండ శంకర్‌లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాలకు బీఆర్ఎస్ వినతిపత్రాలు



బోయినపల్లి: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఇల్లంతకుంటలో ..

బోయినపల్లి: సీఎం రేవంత్‌రెడ్డి అరాచకాల నుంచి లగచర్ల రైతులను కాపాడాలని కోరుతూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. నాయకులు గుంటి శంకర్, నిమ్మ శ్రీనివాసరెడ్డి, బోయిని రాజు, భీమనాథుని రమేశ్, దూస మధు, మానేరు లక్ష్మారెడ్డి, పొత్తూరి రాజేంద్రప్రసాద్, గురజాల కోటి తదితరులున్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ మండల నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ నరసయ్య యాదవ్, సెస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచులు పరుశురాం, వెంకటేశం, కేవీఎస్ రెడ్డి, బుర్ర సూర్య, ఎండీ సాదుల్, తదితరులు పాల్గొన్నారు.

తాటి వనం నరికివేత

- గీత కార్మికుల ఆందోళన



కాలిపోయిన తాటి చెట్లు

ముస్తాబాద్: మండలకేంద్రంలో పెద్దసంఖ్యలో తాటిచెట్ల నరికివేతపై గీత కార్మికులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ముస్తాబాద్‌లో బాలసాని నారాయణ, బాలరాజు, నరేశ్ తమ వ్యవసాయ పొలంలోని 25 తాటి చెట్లను నరికివేశారని గీత కార్మికులు పేర్కొన్నారు. తమ జీవనోపాధిగా ఉన్న తాటి చెట్లను నరికివేసి కాల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వారు కూడా గీత కార్మిక కుటుంబానికి చెందిన వారేనని, తాటి వనాన్ని ధ్వంసం చేయడం సరికాదన్నారు. దీనికి కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు చేశామన్నారు. కార్మికుల ఫిర్యాదు మేరకు ఎక్సైజ్ కానిస్టేబుళ్లు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. గౌడసంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, బండి లక్ష్మయ్య, రాములు, ఎల్లయ్య, గుండెల్లి రాములు, రాజారాం, బాలయ్య, రంగయ్య, సత్తయ్య, రాజేశం తదితరులున్నారు.

బైక్ చోరీపై కేసు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో దాసరి అజయ్‌కుమార్‌కు చెందిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లడంపై మంగళవారం పోలీసులు కేసునమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా పెరుగుపల్లి గ్రామానికి చెందిన అజయ్‌కుమార్ మండల కేంద్రంలో నివాసముంటూ మేస్త్రీ పని చేస్తున్నాడు. ఈనెల 12న రాచర్లబొప్పాపూర్‌లోని గణపతి బట్టల దుకాణం ముందు బైక్ పార్కుచేశాడు. పని ముగించుకొని మధ్యాహ్నం వెళ్లి చూసేసరికి గుర్తు తెలియని వ్యక్తులు బైక్ ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.